# బలి

రచన : శ్రీ బి. నాగేశ్వరరావు



అప్పుడే ప్రొద్దు గ్రుంకింది.

పక్షులు గూళ్ళు చేరుకుంటున్నాయి.

పశుల కాపర్లు పశువులను పొలాలనుంచి యిళ్ళకు ఎళ్ళించుకు పోతున్నారు. వెంకన్న యింటి ముందు నిలుచుని 'సీతాయి' కోసం ఎదురు చూస్తున్నాడు. సీతాయి కాళ్ళమ్మ నాన్నతో వెంట పొలాని కెళ్ళింది. ఇంకా తిరిగి ఇంటికి రాలేదు. వాళ్ళ వెంట వెళ్ళిన "గాలిగాడు" కూడా యింకా రాలేదు. అరగంట సేపటినుంచీ ఎదురు చూస్తున్న వెంకన్న విసిగి యింట్లోకి వెళ్ళి వంట చేస్తున్న అమ్మనడిగాడు.

"ఏమే అమ్మా! సీతాయి యింకా రాలేదు?

"వస్తాది లేరా" కాస్త విసుగుతో జవాబిచ్చింది పని తొందరలో వున్న రంగమ్మ. మళ్ళి వెంకన్న బయటికి వచ్చి పంచటరుగుపై కూర్చొని "సీతాయి" కోసం ఎదురు చూడసాగాడు.

సీతాయంటే వెంకన్నకు ప్రాణం. సీతాయికి కూడా వెంకన్నంటే చాలా ప్రేమ. వెంకన్న సీతాయితో ఆడుకుంటాడు. వెంకన్నకి ఐదేళ్ళు. సీతాయిని యాభయి రోజుల వయస్సు. వెంకన్న వూర్లో వున్న ఎలిమెంటరీ స్కూల్లో ఒకటో తరగతి చదువుతున్నాడు. రోజూ సాయంత్రం వెంకన్న బడినుంచి యింటికి వచ్చేసరికి సీతాయి యిల్లు చేరేది. వెంకన్నను చూస్తూనే బుల్లి బుల్లి గెంతులు వేస్తూ వెంకన్న వొడిలో వాలేది. అలాంటిది ఈ రోజు సీతాయి యింకా రాలేదు. చీకటి మెల్లగా కళ్ళు చాపుకుంటోంది. వెంకన్న చిట్టి బుర్రలో ఏవేవో ఆలోచనలు ముసురుకుంటున్నాయి. సీతాయి గురించి చెడ్డ చెడ్డ తలంపు లొస్తున్నాయి. సీతాయి నెవరైనా దొంగలు యెత్తుకొనిపోయినారేమో! తోడేలేమయినా యెత్తుకొని పోయిందో! ఆ మొన్న కడింటి సుబ్బయ్యగారి గొర్రె పిల్లను యెత్తుకపోయింది కదా! మూలింటి అక్కన్నగారి 'మరక'ను యెత్తుక పోయింది. అమ్మో! సీతాయి కేమయినా ప్రమాదం జరిగితే! వెంకన్న కళ్ళంనుండి గిర్రున నీళ్ళు తిరిగాయి. అయినా 'గాలిగాడు' న్నాడు కదా. సరిపెట్టుకున్నాడు. అయినా వెంకన్న ప్రాణం సీతాయి యింకా రాకపోయేసరికి తహతహలాడిపోతోంది.

"ఎంకడూ! బువ్వ తిని కొంతసేపు పడుకోకూడదూ, ఊరికే కూర్చోకుంటే' రంగమ్మ కొడుకుని పిలిచింది కదుటి దీపం తెచ్చి తలుపు గూట్లో పెడుతూ. కాని వెంకన్న పలుకలేదు. పంచటరుగుపై చలనం లేకుండా కూర్చున్నాడు. "సీతాయి వస్తాది లేరా! బువ్వ తిందురా!" అనేసి రంగమ్మ యింట్లోకి పోయింది. ఆమె అటులోని వెళ్ళిందో లేదో యింటి ముందు మువ్వల చప్పుడు వినిపించింది. చటుక్కున వెంకన్న లేచి నిలబడ్డాడు.

వెంకన్న తండ్రి నారయ్య మెడపైన చిన్న మేక పిల్లను వేసుకొని యింటి ముందరున్న తడిక గేటు తోసుకొని వచ్చాడు. అతని వెనుక చిన్నా పెద్దా కలిపి ఐదారు మేకలూ రెండు బర్రెలనీ తోలుకొని "గాలిగాడు" లోనికి వచ్చాడు. నారయ్య వస్తూనే మేకపిల్లతోసహా సరాసరి యింట్లోకి పోయాడు. వెంకన్న యెంతో సంతోషంతో తండ్రివెంట లోనికెడుతూ "నాయనా! సీతాయిని ఎందుకు నీవే యెత్తుకొస్తున్నావు" అనడిగాడు. నారయ్య బదులు చెప్పకుండా మెడపైని మేక పిల్లని క్రిందికి దించుతూ "ఏమేవ్ బుడ్డి (దీపం) తీస్కరా మేకపిల్ల కాలికి దెబ్బ తగిలింది" అని పెళ్ళాన్ని కేకేశాడు. వెంకన్న గుండె గుభేలుమంది. ఆత్రంగా మేక పిల్లను దగ్గరకు తీసుకుంటూ "ఏ కాలికి నాయనా" అనడిగాడు. రంగమ్మ యింతలో దీపం

తెచ్చింది. మేకపిల్ల వెనుక కాలికి బలంగా దెబ్బ తగిలింది. రక్తం చాలా కారింది. వెంకన్న ప్రాణం విలవిల లాడింది. నారయ్య గుడ్డ చింపి మేకపిల్ల కాలిని కట్టు కడుతూంటే మేకపిల్ల బాధతో అరచిన అరుపు వెంకన్న లేత గుండెల్ని పిండింది. చేతులు చాచి మేక పిల్లను తన వడిలోనికి తీసుకని పొదవి పట్టుకున్నాడు. దీపం వెలుగులో మేకపిల్ల వెంకన్న కళ్ళలోనికి చూసింది. దాని కళ్ళు వెంకన్న లేత హృదయాన్ని కదిలించి వేశాయి. ఒక్కసారిగా భోరుమన్నాడు. వెంకన్న మేకపిల్ల "మే మే" అంటూ దుఃఖించింది. యాభయి రోజులున్న వయసుగల ఆ మూగ జీవానికి ఊహా సరిగా తెలియని ఐదేళ్ళ పసివాడు వెంకన్నకు మధ్యగల అవ్యాజానురాగం, ప్రేమా చూసి నారయ్య రంగమ్మ ముక్కుపై వ్రేలేసుకున్నారు. సీతాయికి తగిలిన గాయం తప్పక నయమవుతుందని అమ్మ చెప్పేదాకా వెంకన్న స్థిమితపడలేదు.

సీతాయి కాలు బాగయింది. ఎప్పటిమాదిరే వెంకన్న సీతాయిలు ఆడుకుంటున్నారు. ఒకనాడు సాయంకాలం బడినుంచి వచ్చిన వెంకన్నకు జ్వరం వచ్చింది. జ్వర తీవ్రత హెచ్చి స్పృహతెలియకుండా పడిపోయాడు వెంకన్న. స్పృహ తెలుస్తూనే ముందుగా వెంకన్న కళ్ళకు సీతాయి మంచం ప్రక్కన నిలుచుంది కనిపించింది. వెంకన్న సీతాయి వైపు తల త్రిప్పి చూశాడు. అది యింకా దగ్గరికి వచ్చి వెంకన్నను ప్రేమతో నాలుకతో స్పృశించింది. చిరుతోక సంతోషంగా ఆడించింది. తర్వాత వెంకన్న ఆరోగ్యం బాగయింది. మంచంలో వున్నన్ని నాళ్ళు వెంకన్న సీతాయిని పొలానికి పంపనివ్వలేదు. మరికొన్ని దినాలు ఆనందంగా గడిచాయి. నల్లగా నిగనిగలాడే బొచ్చుతో అక్కడక్కడా తెల్లని మచ్చలతో సీతాయి రోజు రోజుకీ వెంకన్న కన్నుల పండువు చేస్తుంటే వెంకన్న బడి సమయాలు తప్పితే తక్కిన విరామ సమయాలలో సీతాయితో గడిపేవాడు.

ఒకనాడు యింకా తెల్లవారకముందే రంగమ్మ వెంకన్నను నిద్రనుండి లేపింది. వెంకన్న లేచి చూస్తే యింటి ముందు యింటిలో శుభ్రంగా అలికి ముగ్గులు వేశారు. గాలిగాడు హుషారుగా [illegible]

TEL: "TWINBIRDS" PHONE: 20818

Use Always Our.....

P.V.S. 'TWINBIRDS' (R) BANIANS

P.V.S. KNITTINGS TRADE MARK TIRUPUR PVS

"TOWER KNITTING MILLS" BANIANS

MFGRS:

P. V. S. KNITTINGS

16/12, AZAD STREET, TIRUPUR-638601




అటూ యిటూ తిరుగుతున్నాడు. తండ్రి నారయ్య అప్పుడే స్నానం చేసి కొత్త బట్టలు వేసుకున్నాడు. వూళ్ళో చుట్టపక్కాలు యిరుగు పొరుగు వాళ్ళు అందరూ ఒక్కొక్కరే రాసాగారు. తప్పెట్లూ, మేళాలూ వచ్చాయి. వెంకడికిదంతా సరిగా బోధ పడలేదు. మళ్ళీ రంగమ్మ వెంకన్న కూర్చున్న మంచం దగ్గర వచ్చి ''లెయిరా! అమ్మవారి దగ్గరకు పోవాలి, నీకు నీళ్లు పోసి కొత్త గుడ్డలు యేస్తాను'' అంది. 'ఎందుకే' అన్నాడు ఎంకడు.

''నీకు పెద్ద జొరం వచ్చిందిలేదా. జొరం నయమయితే అమ్మవారికి గండా దీపం మోస్తానని మొక్కుకున్నాం రా. లెయ్యి! నీల్లు పోసుకుని కొత్త బట్టలు ఎసుకుందువు'' అంటూ కొడుకును మరిపెంగా ఎత్తుక నీళ్ళ గదిని లోనికి దారి తీసింది రంగమ్మ. వెంకన్న ముస్తాబయ్యాడు. సీతాయి ఘల్లు ఘల్లుమని మెడలో చిరుమువ్వలు చప్పుడు చేసుకుంటూ వెంకన్న దగ్గరకు వచ్చింది. సీతాయిని చూసి వెంకన్న ఆశ్చర్య ఆనందాలతో సతమతమయ్యాడు. సీతాయికి మెడలో పూలదండ వేశారు. నుదుట పసుపు కుంకమా పెట్టారు. కొమ్ముకు పూలదండ చుట్టారు. సీతాయి ఆ వేళ భలే ముద్దుగా వుంది. ప్రేమానందాలతో సీతాయి నెత్తుకున్నాడు వెంకన్న. ముద్దుల వర్షం కురిపించాడు. తల్లి రంగమ్మ దగ్గర సీతాయిని యెత్తుకనిపోయి 'అమ్మా! ఏంటే సీతాయిని యీయాల పూలూ కుంకం పెట్టినారు'' అనడిగాడు. ''సీతాయికి కూడా యీయాల్ల పండగేరా! దాన్ని కూడా అమ్మవారి దగ్గరికి తీసుకపోతున్నాం'' అని చెప్పింది రంగమ్మ. ఛీ! ఛీ! ఎగిరి గంతు లేశాడు. వెంకన్న. సీతాయి కూడా బుల్లి బుల్లి గెంతులేసి తన ఆనందాన్ని ప్రకటించింది. మరో క గంటకల్లా ఆడా మొగా పిల్లా జెల్లా అంతా గుడికి బయలుదేరారు. తప్పెట్లు మేళలూ జోరుగా వాయిస్తున్నారు. రంగమ్మ నెత్తిన యిత్తడి పళ్ళెంలో గోధుమ పిండితో చేసి వెలిగించిన జ్యోతిని పెట్టుకొని నడుస్తుంది. నలుగురు ఒక చీరను నాల్గు చెరగులూ పట్టుకోగా నారయ్య మధ్యన ముల్లుగర్ర పెట్టి యెత్తి పట్టుకొని జ్యోతిపైన దేరాలాగు చేశాడు. రంగయ్య ముందు చాకలివాళ్ళు చీరలు పరుస్తున్నారు. వాటిపైన రంగమ్మ జ్యోతితో నడుస్తుంది. వెనకాల వెంకన్న వెంకన్న ప్రక్కన సీతాయి నడుస్తున్నారు. అంతా సంతోషంగా వున్నారు. గాలిగాడు బాగా త్రాగి తప్పెట్ల ముందు చిందు లేస్తున్నాడు. నారయ్య ఒక చేత్తో వెంకన్నను పట్టుకున్నాడు. వెంకన్న సీతాయి మెడలోని తాడును పట్టుకున్నాడు. సీతాయి వెంకన్న వెంట బుల్లి బుల్లి గెంతులేస్తూ నడుస్తుంది. దాని సొగసు చూసి వెంకన్న తెగ మురిసిపోతున్నాడు.

అందరూ వూరి బయట పోలేరమ్మ గుడికి చేరారు పొట్టిగా నల్లగా లావుగా వున్న పూజారి కమ్మరయ్య గుడిముందు అటూ ఇటూ గెంతుతూ వీరిని చూసి కేకలు వేయసాగాడు. అందరూ గుడి ముందు నిలుచుని వంగి దండాలు పెట్టసాగారు. తప్పెట్లు మేళాలూ మారుమ్రోగిపోతున్నాయి. సీతాయిని పట్టుకుని నిలుచుని చోద్యం చూస్తున్న వెంకన్నతో రంగమ్మ అంది. ''నాయనా నేను నూరేళ్లు సల్లగుండాలని అమ్మవారికి దణ్ణం పెట్టమ్మా'' అంది. వెంకన్న గుడి ముందు సాగిలబడి, ''నేను నూరేళ్లుండాలమ్మో! నా సీతాయి నూరేళ్లుండాలమ్మో!'' అని మొక్కుకున్నాడు. పక్కనే వున్న సీతాయి దండం పెడుతున్నట్టు తల వంచింది.

చాలామంది జనం టెంకాయలు కొట్టారు, నిమ్మకాయలు కోసి వేశారు. పూజారి కమ్మరయ్య నారయ్య నారయ్యను చూసి ఏదో అడిగాడు. నారయ్య తిరుగా కేక వేశాడు. "ఒరే గాలిగా మేక పిల్లేదిరా" అని గాలిగాడు సీతాయి వెంకన్న వద్ద వుండటం చూసి "ఇగ్గో యీడుండాది ఎంకన్నకాడ" అని అంటూ వెంకన్న వద్దకు వచ్చి సీతాయిని లాక్కొని పోబోయాడు. వెంకన్న "ఒరేయ్ దాన్ని యాడకి వుండనీ. నా దగ్గరే వుంటాది" అంటూ గాలిగాని చేతుల్లోని సీతాయిని తిరిగి తీసుకోబోయాడు. కాని గాలిగాడు విసురుగా సీతాయిని లాక్కొని అమ్మవారి కెదురుగా గుడిముందుంచాడు. జనమంతా గోలగోలగా అరుస్తూ సీతాయి చుట్టూ గుమి గూడారు. ఏదేదో అరుస్తున్నారు. కమ్మరయ్య ఆ చిన్న గుడి లోపలికి దూరి ఈవలకు ఊడి పడితే కూడా వున్నాడు. నారయ్య అరిచాడు. "య్యావ్ కమ్మరయ్యా ఏందింకా ఆలీశం తొరగా కానీయి. పొద్దయితాంది." "వచ్చి వచ్చి" అని కమ్మరయ్య తన లావాటి తారు(ద్రమ్ములాగున్న కాయాన్ని గుడిలోనుండి ఈవల పడవేసి "జరగండి, జరగండి" అంటూ అరుస్తూ గుంపును తోసుకుంటూ సీతాయి వున్న చోటికి వచ్చాడు. అతని చేతిలో తళతళలాడే కత్తి వుండటం చూసి వెంకన్న అయోమయంలో పడి పోయాడు. సంబరంగా వున్న వెంకన్న ముఖం రంగులు మారింది. వెంటనే సీతాయి దగ్గరకు వెళ్ళి ప్రక్కన నిలుచున్నాడు. నారయ్య ఏదో అరిచాడు. గాలిగాడు సీతాయిని నేలపై పడవేసి నాలుగు కాళ్ళను కలిపి పట్టుకున్నాడు. సీతాయి "మే మే" అంటూ ఆర్తనాదం చేసింది. కమ్మరయ్య కత్తిని అరచేతిపై ముందుకు దుమికాడు. వెంకడి గుండె గుభేలుమంది వెంకన్నకంతా అర్థమయింది. వెంటనే గాలిగానిపై గాలివానలా విరుచుకుపడి వాడిని కాలా చేతా ఎడా తన్నసాగాడు. "యిడుసు! సీతాయిని యిడుసురాంటే" అని ఆక్రోశించాడు. గాలిగాడు తల విదిలించి "పక్కకు పో ఎంకన్నా" అని అదిలించాడు. వాడికదిన వస్త సంబంధకాలలో సీతాయి గిలగిలా తన్నుకుంటోంది. హృదయ విదారకంగా అరుస్తోంది. కమ్మరయ్య ముందుకు వంగి సీతాయి మెడ విరచి వెనక్కి పెట్టాడు. అందరూ సంతోషంతో చూస్తున్నారు. వెంకన్నకు దుఃఖం ఆగలేదు. కమ్మరయ్యపైనా గాలిగానిపైన పడి చేతులతో కాళ్ళతో కొట్టసాగాడు. "వద్దు వద్దు! సీతాయిని చంపాకండి" అంటూ దుఃఖోద్వేగంతో అరుస్తున్నాడు. అక్కడున్న వారంతా వెంకన్నకు వారించారు. తల్లి రంగమ్మ ముందుకు వచ్చి వెంకన్నను బలవంతంగా ప్రక్కకు లాగింది. విదిలించి కొట్టాడు కొడుకు. ఈ సారి నారయ్యా రంగమ్మ యిద్దరూ కలిసి వెంకన్నను వడిసి పట్టుకున్నారు. దుఃఖంతో మెలికలు తిరిగిపోతున్న కొడుకుతో అంది రంగమ్మ 'ఏడవాకురా! నీకు జెరం బాగయి కల్లంగుంటే మేకపిల్లను యిచ్చుకుంటామని అమ్మవారిని మొక్కుకున్నాము. నీ వేసిస్తే అమ్మవారికి కోప మొస్తాది," నిస్సహాయంగా వెంకన్న చూస్తుండగానే కమ్మరయ్య చేతిలోని పదునైన కత్తి సీతాయి లేత కంఠం నాళాలను సరసరా తెంచి వేసింది. ప్రాణం పోయేటప్పుడు బాధతో కర్ణకఠోరమైన ఆర్తనాదం తెగబోయే ఆ లేత మేకపిల్ల గొంతులోంచి వినిపించింది. రక్తం కల్లరయింది. వెంకన్నను వెయ్యేళ్లు చల్లగా బ్రతికించాలని వెంకన్నకు ప్రాణానికి ప్రాణమయిన బుల్లి మేకపిల్ల 'సీతాయి' అమ్మవారి గుడిముందు బలైపోయింది. ఆ హృదయ విదారకమైన దృశ్యం చూసిన వెంకన్నకు మైకం వచ్చింది. వెంకన్నను ఒక వైపు పట్టుకొని మేకపిల్ల తెగిన తలకాయ పోలేరమ్మకు వంగి దండం పెడుతున్న నారయ్యా, రంగమ్మా వెంకన్న మైకం క్రమ్ముకున్న కళ్ళకు లీలగా కనిపించారు.

